క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: మండలంలోని నిమ్మల గూడెం సబ్‌స్టేషన్ పరిధిలో నిమ్మలగూడెం, టెక్కినవారిగూడెం గ్రామాలకు 3 ఫేజ్ లైన్ వేయు నిమిత్తం (ఆర్‌డీఎస్‌ఎస్ స్కీమ్) పనులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిమ్మలగూడెం, టెక్కినవారిగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం సెక్షన్ పరిధిలోని బోడిగూడెం సబ్ స్టేషన్ మరమ్మతులు, 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో డీఈ పీర్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బోడిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

15న మణిద్వీప వర్ణన

బుట్టాయగూడెం: కుమ్మరిగట్టు వద్ద ఉన్న విజయగణపతి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 15వ తేదీన మణి ద్వీపవర్ణన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పి.సోంబాబు తెలిపారు. నాలుగో శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పూజా కార్యక్రమం 108 మంది మహిళలతో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకూ జరిగే మణిద్వీప వర్ణన కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

బస్సుల్లో పురుషులకు రిజర్వేషన్ సీట్లు కల్పించాలి

కొయ్యలగూడెం: ఆర్టీసీ బస్సుల్లో పురుషులకు రిజర్వేషన్ సీట్లు కల్పించాలని రాష్ట్ర వినియోగదారుల సంఘ ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పంద్రాగస్టు నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న నేపథ్యంలో విపరీతమైన రద్దీ ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. ప్రయాణికుల రవాణాకు సరిపడా బస్సులు పెంచకుండా స్త్రీశక్తి పథకాన్ని అమలు చేయడం వలన బస్సుల్లో టిక్కెట్ కొనుగోలు చేసిన పురుషుల పరిస్థితి ఏమిటన్నారు. ప్రభుత్వం దీనిపై ఆలోచించలేదన్నారు. స్త్రీశక్తి పథకాన్ని హర్షిస్తున్నామని, అదే సమయంలో పురుషులకు కూడా న్యాయం చేయాలని అన్నారు. ఈ మేరకు గవర్నర్‌తో సహా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రులకు ఈమెయిల్ ద్వారా లెటర్లను పంపించామన్నారు.

యడవల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గోపాలరావు



యడవల్లి కమిటీని ప్రకటిస్తున్న శాంతారావు

లింగపాలెం: యడవల్లి గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా చల్ల గోపాలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం పార్టీ గ్రామ అబ్జర్వర్, సీనియర్ నాయకుడు కోటగిరి హరీష్ ఆధ్వర్యంలో పార్టీ యడవల్లి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీని లింగపాలెం మండల అధ్యక్షుడు అన్నపనేని శాంతారావు ప్రకటించారు. అధ్యక్షుడిగా చల్లా గోపాలరావు, ప్రధాన కార్యదర్శులుగా చెలిమంతు నాగ వీర చెన్నారావు, ఈడా రాజేష్, కాకాని కిరణ్, పి.వెంకటేశ్వరరావు, కార్యదర్శులుగా తమ్మిశెట్టి శ్రీనివాసరావు, సత్తెన్నపల్లి నాగరాజు, నందిపాము సోంబాబు, నల్లజర్ల భోగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ పటిష్ఠతకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

సొసైటీ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కార్యవర్గం

టి.నరసాపురం: కె.జగ్గవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్‌పర్సన్‌గా బొంతు సత్యనారాయణ, పర్సన్లు పేరాబత్తుల జగన్ బాల విఘ్నేశ్వర రావు, పొలిమేర వెంకటేశ్వరరావు సోమవారం సంఘం పర్సన్ ఇన్‌చార్జి తోట లక్ష్మణరావు పర్యవేక్షణలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బొంతు సత్యనారాయణ మాట్లాడుతూ సంఘాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. మాజీ జెడ్పీటీసీ నల్లూరి వెంకట చలపతిరావు, జయవరపు శ్రీరామమూర్తి, నాయుడు రామకృష్ణారావు గౌడ్, ఓబిళ్లనేని రాంబాబు, వెలిది గంగాధరరావు, కలిశెట్టి పార్థసారథి, సీఈవో తనగాల వీరవెంకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెదపాడు: అప్పనవీడు శ్రీఅభయాంజనేయ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈఓ తారకేశ్వరరావు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 20 రోజుల్లో నమూనా ఫారం -2 దరఖాస్తును జిల్లా దేవాదాయ అధికారి, ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్, ఏలూరు వారికి పంపించాలని తెలిపారు.

డాక్టర్లు లేకుంటే.. వైద్యం ఎలా?

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో వేధిస్తున్న వైద్యుల కొరత
- అవస్థలు పడుతున్న రోగులు



జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులు



చింతలపూడి ఆసుపత్రిలో వైద్యుల కొరతతో వెలవెలబోతున్న ప్రసూతి వార్డు

చింతలపూడి: చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. దీంతో పేదలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షలా మారింది. పేరుకు 30 పడకల ఆసుపత్రి అయినా ఇక్కడ వైద్యుల కొరత రోగులను తీవ్రంగా బాధిస్తోంది. 23 మంది డాక్టర్లకు ప్రస్తుతం కేవలం 10 మంది వైద్యులు మాత్రమే పని చేస్తున్నారు. అదే విధంగా గైనకాలజిస్ట్ పోస్టులు ఇక్కడ మూడు ఉన్నాయి. ఒక సివిల్ సర్జన్, ఇద్దరు డిప్యూటీ సివిల్ సర్జన్‌లు ఉండాలి. సివిల్ సర్జన్ పోస్టుకు పల్నాడు నుంచి ఒక వైద్యురాలిని ఏడాది క్రితం నియమించారు. ఇటీవల ఒక గైనకాలజిస్ట్‌ను నియమించారు. వైద్యుల కొరతతో గర్భిణులు, ప్రసూతి కోసం వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఏళ్ల తరబడి ఇక్కడ అంబులెన్స్ లేదు. కొత్త అంబులెన్స్‌ను మంజూరు చేయాలని రోగులు కోరుతున్నారు. చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి లింగపాలెం, కామవరపుకోట, టి.నర్సాపురం, చింతలపూడి మండలాల నుంచే కాక కృష్ణా జిల్లా, ఖమ్మం జిల్లాల నుంచి నిత్యం 250 నుంచి 300 మంది రోగులు వైద్యం నిమిత్తం ప్రతి రోజు వస్తుంటారు. రాఘవాపురం, యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కూడా 20 మంది రోగులకు పైగానే వస్తుంటారు.

జంగారెడ్డిగూడెంలోనూ వైద్యుల పోస్టులు ఖాళీ

జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి కూడా 250 మంది వరకు వస్తుంటారని వైద్యులు తెలిపారు. ఇక్కడ కూడా 4 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆసుపత్రిలో డాక్టర్లను నియమించాలని అనేక సార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రం చింతలపూడిలో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి పూర్తయితేనే డాక్టర్ల కొరతతో పాటు మందులు, సిబ్బంది కొరత తీరుతుందని అంటున్నారు.

కె.కోటలో వైద్యులే లేరు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో వైద్యులు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ ఇద్దరు డాక్టర్లు ఉండవలసి ఉండగా ఇప్పుడు ప్రస్తుతం ఒక్కరూ లేరు. తడికలపూడి ప్రాథమిక వైద్య కేంద్రం నుంచి ఒక డాక్టర్ ప్రతిరోజూ వచ్చి ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతిరోజు సుమారు 60 మంది రోగులు వైద్యం నిమిత్తం వస్తుంటారు. ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని పలువురు కోరుతున్నారు.

ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఆసుపత్రికి జ్వర పీడితులు ఎక్కువగా వస్తున్నారు. రోగులకు రక్త పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తున్నాం. వర్షాల వల్ల జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున రోగులకు వైద్య సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఆసుపత్రిలో జ్వరాలకు సంబంధించిన మందుల కొరత లేదు.

– బేబి కమల, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

అందుబాటులో లేని మలేరియా మందులు



బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఓపీ నమోదు చేయించుకునేందుకు రోగుల పడిగాపులు

బుట్టాయగూడెం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో గిరిజన ప్రాంతంలో టైఫాయిడ్, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ ఏడాది అత్యధికంగా మలేరియా కేసులు నమోదవుతున్నాయి. వీటి నివారణకు ఏఎన్‌ఎం స్థాయిలోనే ఇచ్చే క్లోరోక్విన్, ప్రైమక్విన్ టాబ్లెట్‌లు మాత్రం అందుబాటులో లేవని సమాచారం. మలేరియా కేసు నమోదైతే ఏఎన్‌ఎం మాత్రమే మలేరియా జ్వర పీడితులకు తగు మోతాదుల్లో ఆ మాత్ర ఎలా మింగాలో చెబుతూ మాత్రలు ఇచ్చేవారు. అయితే మండలంలోని ఏ పీహెచ్‌సీలో కూడా ఈ మందులు అందుబాటులో లేవని చెబుతున్నారు.

మలేరియా కేసులు దాస్తున్న అధికారులు

ఏజెన్సీప్రాంతంలో మలేరియా కేసులు అత్యధికంగా నమోదవుతూ ఉంటాయి. అయితే కేసు నమోదైన ప్రాంతంలో వాటి నివారణకు చాలా స్థాయిలో చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మలేరియా కేసులు అధికంగా వస్తున్నా అధికారులు ఉద్దేశపూర్వకంగానే తక్కువ చేసి చూపిస్తున్నారని ఆస్పత్రి వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఇటీవల ఈ వ్యవహారంపై ఉన్నతాధికారుల నుంచి నోటీసులు కూడా వచ్చినట్లు తెలుస్తోంది. గ్రామాల్లో మలేరియా వ్యాధిని అరికట్టకుండా కేసులు తక్కువ చూపించడం వల్ల భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు ఏ విధంగా తలెత్తుతాయో అని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఓపీ వద్ద అవస్థలు

స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో రోజుకు 100 నుంచి 150 మంది వరకు రోగులు వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. అయితే ఆస్పత్రికి వచ్చిన రోగులు ఓపీల వద్ద ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్‌కార్డ్ నమోదు, ఓటీటీ కోసం వారు పడుతున్న బాధలు వర్ణనాతీతం. పేరు నమోదు చేయించుకునేందుకు ఓపీల వద్దే గంటల తరబడి సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ఈ సీహెచ్‌సీలో వైద్యుల కొరత కూడా ఉంది. ముఖ్యమైన జనరల్ ఫిజీషియన్‌తోపాటు, జనరల్ సర్జన్, సీఐఎస్ జనరల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నందాపురం పీహెచ్‌సీ, కేఆర్‌పురం పీహెచ్‌సీకి సంబంధించి ఒక ల్యాబ్ టెక్నీషియన్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.

ఓటర్ జాబితాలు సవరించాలి



ఇన్‌చార్జి ఎంపీడీవోకి వినతిపత్రం అందజేస్తున్న యువకులు

కొయ్యలగూడెం: ఓటర్ జాబితాను సవరించాల్సిందిగా ఇన్‌చార్జి ఎంపీడీవో జి.సతీష్ కుమార్‌కి కొయ్యలగూడెం చెందిన యువకులు సోమవారం పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం సమర్పించారు. కొయ్యలగూడెం మండలంలోని పంచాయతీల్లో ఓట్లు విధానం సరిగా లేదని, దీనివల్ల వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు తీవ్ర గందరగోళానికి గురయ్యే పరిస్థితి ఉందన్నారు. ఓట్లు ఏరియా వారీగా క్రమపద్ధతిలో ఉండే విధంగా చేయాలన్నారు. వార్డ్ నెంబర్లు ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగానూ, ఒక కుటుంబానికి సంబంధించి ఓటర్లందరూ ఒకే బూత్‌లో ఉండే విధంగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బొబ్బర చినరాజు, ఆరేటి వీరపండు, చిటికెన బాలగంగాధర్ తిలక్, జలధాని తేజ, వెంకీ యాదవ్ పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం



చింతలపూడిలో నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

జంగారెడ్డిగూడెం: ఏరియా ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు మాట్లాడుతూ ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులకు గత రెండు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, దీంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు పీఎఫ్ బకాయిలను ఖాతాలకు జమచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే తమను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు, సహాయ కార్యదర్శి సుంకర రాధాకృష్ణ (బాబు), ఏఐటీయూసీ నాయకులు రాజు, మేరీ, చంద్రకళ, దమయంతి, జె.దుర్గారావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ బకాయిలు విడుదల చేయాలి

చింతలపూడి: పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షురాలు తొర్లపాటి మరియమ్మ డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రావాల్సిన పీఎఫ్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మరియమ్మ మాట్లాడుతూ కాంట్రాక్టర్ గడువు ముగిసిందని, కానీ పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలు కార్మికుల ఖాతాల్లోకి జమ కాలేదన్నారు. తక్షణం పీఎఫ్ బకాయిలు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగరాజు, కుమారి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌లో 12 అర్జీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 12 అర్జీలు అందినట్లు ఆర్డీవో ఎంవీ రమణ తెలిపారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. శ్రీనివాసపురంలో స్థల ఆక్రమణపై బి.బంగారయ్య, భూమిని సర్వేచేయాలని తాడువాయికి చెందిన గాలింకి ఫ్రాన్సిస్, పంగిడిగూడెం బండిదారి ఆక్రమణపై పేరంపేటకు చెందిన భీమడోలు పిచ్చియ్య, పంగిడిగూడెం- లక్కవరం ఆర్‌అండ్‌బీ రహదారి ఆక్రమణపై పంగిడిగూడెం గ్రామానికి చెందిన బేతాళ అశోక్, జంగారెడ్డిగూడెం – తాళ్లపూడి – రాజమండ్రి ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని జంగారెడ్డిగూడెంకు చెందిన కె.రమణారావు అర్జీలు అందజేశారు. బీసీ రుణాలు ఇప్పిస్తామని తమ నుంచి రూ. 9.77 లక్షలు వసూలు చేసిన సత్తిపండుపై చర్యలు తీసుకోవాలని దేవులపల్లి గ్రామానికి చెందిన తనుబోయిన సుబ్బారావు, మరికొందరు అర్జీలు అందజేశారు. అలాగే పేరంపేటలో వీధికుక్కలు బెడద ఎక్కువగా ఉందని కలపాల వెంకటేశు, మరికొందరు వినతిపత్రం అందజేయగా, ఎక్కువగా భూ సంబంధిత సమస్యలపై అర్జీలు అందినట్లు ఆర్డీవో కార్యాలయ అధికారులు తెలిపారు.

కూటమి మోసాలను ప్రజలకు తెలపండి



ఆడమిల్లిలో వైఎస్సార్‌సీపీ నూతన కమిటీ సభ్యులతో మండల కన్వీనర్ సత్యనారాయణ

కామవరపుకోట: సూపర్ సిక్స్ పథకాలతో గద్దెనెక్కిన కూటమి నాయకుల మోసాలను గ్రామస్థాయిలో ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ పిలుపునిచ్చారు. తాడిచర్ల, ఆడమిల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మాయ మాటలు చెప్పి పాలన చేపట్టిన కూటమి ప్రభుత్వం పథకాలు సక్రమంగా అమలు చేయకుండా యువతను, మహిళలను సైతం మోసం చేసిందన్నారు. కూటమి నాయకులు గ్రామాల్లోకి వస్తే హామీలు నెరవేర్చే విధంగా నిలదీయాలని ఆయన కోరారు. గ్రామ కమిటీల్లో వీరిశెట్టిగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మిడత మారయ్య, ఆడమిల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మద్దిపాటి భీమేశ్వరరావును పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణ ఏకగ్రీవంగా ప్రకటించారు. కార్యక్రమంలో వీరిశెట్టిగూడెం గ్రామ కమిటీ పరిశీలకులు కనకేళ్ళ రత్నకుమారి ఏసు పాదం, ఆడమిల్లి గ్రామ కమిటీ పరిశీలకులు గంటా భాస్కరరావు, ఎంపీటీసీ ఉప్పలపాటి సాయిబాబు, మలకలపల్లి నరసింహరావు, మద్దిపాటి ప్రభాకర్‌రావు, పారెపల్లి పుల్లాచారి, కందికొండ నాగేశ్వరరావు, దొడ్డి మనోహర్, తానేటి నాగరాజు, వేముల సాయి, రుద్రపాక నాగ మల్లేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటులో చంద్రబాబు సిద్ధహస్తుడు



యడవల్లిలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న కంభం విజయరాజు, నేతలు

లింగపాలెం: అధికారం కోసం వెన్నుపోటు పొడవడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కంభం విజయరాజు పేర్కొన్నారు. లింగపాలెం మండల పార్టీ అధ్యక్షుడు అన్నపనేని శాంతారావు ఆధ్వర్యంలో సోమవారం యడవల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అమలు చేస్తామని, ఆదాయాన్ని సృష్టిస్తామని అబద్ధాలు చెప్పి, ఎన్నికల్లో గెలిచి, నేడు పథకాలు అమలుచేయకుండా రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పి విద్యుత్ చార్జీలను పెంచి పేదలు, రైతులను నిలువునా మోసం చేశారన్నారు. గ్రామాల్లో వీధి వీధినా బెల్టుషాపులను నిర్వహిస్తూ మద్యాన్ని ఏరులై పారించి పేదల కష్టాన్ని దోచుకుంటున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి పథకాలను సీఎం చంద్రబాబు పూర్తిగా విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం మోసం చేస్తున్న తీరును వివరించాలన్నారు. అనంతరం క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చెలికాని చిట్టియ్య, కోటగిరి హరీష్, కోటగిరి ధీరజ్ కృష్ణ, చీదరాల ప్రసాద్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీల ఐక్యతతోనే రాజ్యాధికారం

ఏలూరు (టూటౌన్): ఎస్సీలు ఐక్యతోనే రాజ్యాధికారం సాధించగలుగుతారని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌ఆర్ పేటలోని ఎస్సీఆర్‌పీఎస్, ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 1997లో వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన చలో సచివాలయం కార్యక్రమంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని 2004లో కోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చినప్పటికీ ఇంకా ఇందే అంశాన్ని చేత పట్టుకొని అదేదో అభివృద్ధి పథకమని చెప్పడం దేశంలోని అగ్ర వర్ణాల వారి స్వార్థానికి పరాకాష్ట అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన రాజ్యాంగ విలువలను కాపాడుకునేందుకు సైనికుల్లా తయారవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మృత వీరులకు ఘనంగా నివాళులర్పించారు.

స్వాతంత్ర్య సంబరం.. స్ఫూర్తిదాయకం

కొయ్యలగూడెం: స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా కొయల్యగూడెంలో ఏర్పాటు చేసిన రజతోత్సవ, స్వర్ణోత్సవ, అమృతోత్సవ స్తూపాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. పరింపూడి పంచాయతీ పరిధిలోని ఒకప్పటి పంచాయతీ సమితికి ఎదుట 1972వ సంవత్సరంలో రజతోత్సవ వేడుకల్లో ఆనాటి ప్రభుత్వం కొయ్యలగూడెంకి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు చంద్రుపట్ల కృష్ణమూర్తి, పెద్దాడ రామచంద్రరావు పేరిట శిలాఫలకాన్ని రూపొందించింది. జాతీయ పుష్పం, జాతీయపక్షితో పాటుగా నాటి రాష్ట్రాలు, అశోకచక్రం, గ్రాంధిక లిపితో ఉన్న భారత సంవిధానము గురించి శిలా శాసనంలో పొందుపరిచారు. రజోత్సవాలను ఏడాది పాటు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు శిలాశాసనం చెబుతోంది. అదేవిధంగా 1997 భారత స్వాతంత్ర స్వర్ణోత్సవాల్లో మిత్ర యూత్ అనే స్వచ్ఛంద సంస్థకి చెందిన యువకులు జాతీయ చిహ్నం నాలుగు సింహాల స్తూపాన్ని జాతీయ శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేశారు. అదేవిధంగా 2022లో స్వాతంత్ర 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆజాదీ కా అమృత మహోత్సవ స్తూపాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అప్పటి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అమృత మహోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.



ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం ఎదుట రజతోత్సవ శిలాఫలకం



స్వర్ణోత్సవాల్లో గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన జాతీయ చిహ్నం



మండల పరిషత్ కార్యాలయంలో 75 వసంతాల వేడుకల శిలాఫలకం